ఉపాధి హామీలో అక్రమాలకు చెక్

- సమగ్ర సమాచారం కోసం యాప్ రూపకల్పన
- ఉపాధి కూలీలకు బాసటగా నిలిచిన జన్ మరేగా యాప్


పోలసానిపల్లిలో కూలీల హాజరును సెల్‌లో నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు

భీమడోలు: ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టిని సారించింది. ఇన్నాళ్లపాటు అక్రమాలకు అడ్డాగా మారిన ఉపాధి హామీ పనులకు ఇప్పుడు సాంకేతికతతో అడ్డుకట్ట వేసేలా జన్‌మన్ రేగా యాప్‌ను రూపొందించింది. కూలీలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇందులోని నిక్షిప్తమై ఉంటుంది. దీనితో ఈ పథకంలో పని చేసే కూలీల వేతన బకాయిల కోసం, జాబ్ కార్డుల కోసం ఎంపీడీవో, పోస్టాఫీసుల, ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా ఈ యాప్‌లోని వారి సమస్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు. సరైన సమాచారం దొరక్కపోవడంతో తీవ్ర అవస్థలు పడే కూలీలకు ఈ యాప్ వరంలా మారింది. వారి కష్టాలను గుర్తించి ఈ యాప్ అందుబాటులోకి తేవడంతో స్మార్ట్ ఫోన్‌లో ఒక క్లిక్‌తో ఇట్టే సమాచారాన్ని పొందే అవకాశం కలిగింది.

అర్హుల కన్నా... అనర్హులకే అందలం

ఉపాధి హామీ పథకపు పనులు అర్హులకన్నా అనర్హులకే లబ్ధి చేకూరుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన పార్టీల నాయకులు తమ అక్రమాలకు ఈ పథకాన్ని అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. దీనితో కష్టించి పని చేసిన కూలీల సొమ్ము అనర్హులకు చేరుతోంది. దీనితో కూలీలకు న్యాయబద్ధంగా అందాల్సిన సొమ్ముకు కోత పడుతోంది. ఉపాధి హామీ కూలీకి

మండలం	జాబ్ కార్డులు	కూలీల సంఖ్య
భీమడోలు	15,464	21,434
ఉంగుటూరు	16,278	21,631
నిడమర్రు	8,940	9,825
గణపవరం	10,417	11,822

రోజువారీ కూలీ సొమ్మును రూ.300 కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఆ మొత్తం చేతికందడంలేదు. ప్రస్తుతం 100 పని దినాలు అమలవుతున్నాయి. అయితే పని చేయకపోయినా చేసినట్లు మస్తర్లు వేసుకోవడం, కూలీల సొమ్ము స్వాహా వంటివి బహిరంగ ప్రజావేదికల్లో ఆడిట్ జరిగే తరుణంలో మాత్రమే వెలుగుల్లోకి వచ్చేవి. ఇకపై ఈ యాప్ ద్వారా అవినీతిని ఇట్టేగుర్తించి ఫిర్యాదు చేయవచ్చు. మస్తర్ల నమోదులో తేడాలను గుర్తించవచ్చు. కూలీలతో కాకుండా యంత్రాలతో పని చేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసినా, నిధుల దుర్వినియోగం, దొంగ మస్తర్లకు పాల్పడినా ఈ యాప్‌తో ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే సంబంధిత అధికారులు విచారణ చేపడతారు.

కూలీలకు భరోసా

జన్ మరేగా యాప్‌ద్వారా కూలీలకు భరోసా కల్పించేందుకు పనుల్లో పారదర్శకతను పెంచేందుకు దోహదపడుతుంది. కొత్తగావచ్చిన జాతీయ మొబైల్ మానిటరింగ్ సిస్టంపేరిట యాప్ ద్వారా ముఖ ఆధారిత గుర్తింపు యాప్‌తో పనులకు హాజరైన కూలీల ఫొటోలు తీస్తున్నారు. కూలీల సంఖ్య నమోదులో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదు. ఐదు మీటర్ల దూరం నుంచి ఒకే సారి పది మందిని ఈ యాప్ ద్వారా ఫొటో తీయవచ్చు.

జన్‌మన్ రేగా యాప్ డౌన్‌లోడ్ ఇలా

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లో వెళ్లి జన్‌మన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలి. క్లిక్ చేయగానే వారి పూర్తి సమాచారం డిస్‌ప్లేపై కనిపిస్తుంది. ఇందులో కూలీల వివరాలు, వారి హాజరు, వేతనాలు తదితర వివరాలను క్లిక్ చేస్తే వివరాలు వస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలీ వేతనం మొత్తం, ఏ బ్యాంకు లో జమ అయ్యింది, బకాయిలు వంటి పూర్తి వివరాలు వస్తాయి. వేతనాలు జమ కాకుంటే కారణాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి.

యాప్‌తో అవకతవకలను గుర్తించవచ్చు

గతంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి వివరాలన్నీ పబ్లిక్ డోమైన్‌లో ఉండేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కార్మికులకు మరింత బాసటగా నిలిచేందుకు జన్‌మన్ రేగా యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా ఎక్కడ ఎటువంటి అవకతవకలకు పాల్పడినా గుర్తించేందుకు వీలుంటుంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చు. ఈ యాప్‌ను ప్రతి ఒక్క కార్మికుడు డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌పై ఇప్పటికే ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. పనులు మరింత పారదర్శకతతోనే, సమర్థవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

– దామోదర్, ఏపీడీ, ఏలూరు క్లస్టర్

శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి


శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గణపవరం: హిందూ ధర్మ పరిరక్షణకు జీవితాంతం కృషి చేసిన ఛత్రపతి శివాజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కూనిరెడ్డి సోమేశ్వరరావు, అఖిల భారత హ్యాండ్‌లూమ్స్ జిల్లా డైరెక్టర్ నంద్యాల రామలింగ రాజు అన్నారు. బుధవారం గణపవరంలో ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పాపోలు సూర్యారావు, అదపరెడ్డి సీతయ్య, వంటాకుల అప్పన్న, షేక్ వహాబ్, కడియపు సాయి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో

గణపవరం బాలికోన్నత పాఠశాలలో ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. హిందూ ధర్మ పరిరక్షణకు శివాజీ చేసిన కృషిని వక్తలు వివరించారు. వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు అల్లూరి గంగరాజు, హెచ్‌ఎం బాల భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు ఛత్రపతి శివాజీ

దెందులూరు: గొరిల్లా యుద్ధ వీరుడు ఛత్రపతి శివాజీ భారతావనికి ఆదర్శప్రాయుడని స్థానిక బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ నూకరాజు అన్నారు. బుధవారం కళాశాలలో శివాజీ జయంతి సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ జీవిత చరిత్ర, ఆయన చేసిన పోరాటాలు, విజయాలు దేశభక్తి గురించి అధ్యాపకురాలు వివరించారు.

క్లుప్తంగా

మాజీ ఎంపీ సురేష్‌ని కలిసిన నాయకులు


మాజీ ఎంపీతో వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: మాజీ ఎంపీ నందిగామ సురేష్ ను బుధవారం మాజీ సీఎం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలో ఆ పార్టీ పెదవేగి నేతలు గారపాటి రమేష్, గద్దె రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వ అక్రమ కేసులు, దాడులు దౌర్జన్యాలపై చర్చించారు. ధైర్యంగా ఉండాలని, వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని సురేష్ భరోసా కల్పించారని నాయకులు తెలిపారు.

నీటి పొదుపు పాటిద్దాం


నీటి వాడకంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దెందులూరు: నీరు వాడకంలో పొదుపు లేకపోతే మానవ మనుగడకు ముప్పు తప్పదని సీతంపేట పాఠశాల హెచ్‌ఎం జి.సునీత అన్నారు. బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, తోట ఎడ్వర్డ్, విద్యార్థులతో కలిసి నీటి వాడకం పొదుపు భవిష్యత్తు అవసరాలకు ఆదా ఎలా చేయాలి, చేతులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

పుస్తకాలు, బొమ్మల పంపిణీ


పుస్తకాలు, బొమ్మలు అందజేస్తున్న దాత శ్రీధర్

దెందులూరు : తాము జన్మించిన గ్రామంలో విద్యకోసం ఎంతో కొంత చేయాలన్నది తనతో పాటు తన తల్లిదండ్రులు ఆకుల నరసింహారావు, ఉమాలక్ష్మిల ఆశయమని ఎన్నారై శ్రీధర్ అన్నారు. బుధవారం స్థానిక బాలసదనంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బొమ్మలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులంతా బాగా చదువుకుని ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. బాలసదనంలో సమస్యల పరిష్కారానికి, విద్యాభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఆయన చెప్పారు.

అగ్రిస్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి

గణపవరం: రైతులకు అగ్రిస్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరం మండలం మొయ్యేరు రైతు సేవా కేంద్రంలో ఆయన అగ్రిస్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్‌పై అధికారులతో సమీక్షించారు. సాధ్యమైనంత త్వరగా రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సొంత పొలం ఉన్న రైతులు తమ వివరాలను అగ్రిస్టాక్ వెబ్‌సైట్‌లో రైతుసేవా కేంద్రాల ద్వారా త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్టర్‌అవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలద్వారా వచ్చే అన్నిరకాల పథకాలు, రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంటల రుణాలు, వివిధరకాల వ్యవసాయ అనుబంధ రంగాల సేవలకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ఈసందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, వీఏఏలు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ విడుదల

దెందులూరు: దక్షిణ చిన్న కాశీగా పేరుపొందిన దెందులూరు మండలం చల్ల చింతలపూడి మేధా దక్షిణామూర్తి స్వామి ఆయల ఉత్సవాలను ఈనెల 26 నుంచి మార్చి 2 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ విడుదల చేశారు. 26న ఉత్సవాలు ప్రారంభమవుతాయని, నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ సమీపంలో భారీ అన్నదాన సమారాధన ఉంటుందన్నారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత

ఏలూరు రూరల్ : వివిధ కారణాలతో మృతి చెందిన స్నేహితులను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న స్నేహాంజలి క్రికెట్ పోటీలు అందర్నీ ఆకర్షిస్తున్నాయని స్నేహాంజలి ఆర్గనైజర్ చందు అన్నారు. బుధవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జెర్సీ జట్టు ఆటగాళ్లకు మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సొంగా సందీప్ టీషర్టులను అందజేశారు.

చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలి


పెదవేగి : మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శారద

పెదవేగి : చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద అన్నారు. బుధవారం పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తోన్న జ్ఞానజ్యోతి శిక్షణ బుధవారం రెండో కార్యక్రమంలో శారద పాల్గొని మాట్లాడారు. పిల్లల పోషణతో పాటు విద్యపై మక్కువ పెంచేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్, ఈఓ మల్లిక, పర్యవేక్షకురాలు మేరీ, పార్వతి, శాంత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధించాలి

దెందులూరు: జ్ఞానజ్యోతి పథకం లక్ష్యాలను సాధించాలని ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ దెందులూరు, పోతునూరు, సోమవరప్పాడు సెక్టార్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి, భూషణం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పథకంపై శిక్షణ ఇచ్చారు. పిల్లల స్వభావం, లక్షణాలు, అభ్యాసన సమగ్ర అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధా సృజనాత్మకతపై ఎంఈఓ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు మల్లికార్జునరావు, గ్రంథ పాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల శిక్షణ ప్రారంభం

ఉంగుటూరు: స్థానిక హైస్కూల్లో అంగన్‌వాడీ టీచర్ల జ్ఞానజ్యోతి శిక్షణను ప్రధానోపాధ్యాయులు మీరాకుమారి బుధవారం ప్రారంభించారు. ఎంఈఓ రవీంద్ర భారతి మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శిక్షణ పరిశీలకులుగా షేక్ ఫరీదా, ట్రెనింగు ఆర్పీలుగా అల్లు శ్రీను, శిరికి శివ, శివకుమార్, బి.శ్రీలక్ష్మి, డి.శారదామణి వ్యవహరించారు. సీఎం ఆర్‌టీ నాగేంద్ర, విష్ణు, నారాయణ, రవికిశోర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


ఉంగుటూరు : శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

భాషతోనే జ్ఞాన వికాసం

గణపవరం: భాషాజ్ఞానంతోనే మనిషికి జ్ఞానవికాసం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ ముందుగా భాషలపై పట్టు సాధించాలని ప్రభుత్వ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం గణపవరం బాలికల ఉన్నత పాఠశాలలో భాషా దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం బాలభాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని సూచించారు.

మసీదు మరమ్మతులకు విరాళం

పెదవేగి : గ్రామాల్లో సర్వమత సమ్మేళనమే ధ్యేయంగా పనిచేస్తున్నామని గార్లమడుగు సర్పంచ్ జిజ్జువరపు నాగరాజు అన్నారు. బుధవారం పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ పరిధిలోని ములక్కాయపాడులో పర్యటించిన సర్పంచ్ మసీద్ మరమ్మతు పనుల నిమిత్తం రూ.5 వేలు అందించారు. దీంతో ఆయన్ని అభినందించారు.

ఆధార్ కేంద్రం సందర్శన

పెదవేగి : ప్రభుత్వ ఆధార్ నమోదు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శారద సూచించారు. మండలంలోని వేగివాడ అంగన్‌వాడీ కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆరేళ్లలోపు చిన్నారులందరూ ఆధార్ పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట పెదపాడు ఐసీడీఎస్ అదనపు సీడీపీఓ రాజశేఖర్, జిల్లా కార్యాలయపు ఈఓ మల్లిక ఉన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భీమడోలు: పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ రమణ బుధవారం తెలిపారు. మార్చి 6 వరకు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాఠశాలలో 5వ తరగతికి 80, జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఒక్కొక్కరి గ్రూపుకు 80 చొప్పున సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా రోస్టర్ విధానంలో వారికి సీట్లను కేటాయిస్తామన్నారు.

21, 22 తేదీల్లో స్కూల్ గేమ్స్

దెందులూరు: దెందులూరు నియోజకవర్గం సెకండరీ స్కూల్స్ గేమ్స్ ఈనెల 21, 22 తేదీల్లో కొవ్వలి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించనున్నట్టు కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీఎస్‌ఎల్‌ఎన్‌వీ శర్మ, పీడీలు జె.సురేష్ కుమార్, గవ్వా శ్రీనివాసరావులు తెలిపారు బుధవారం వారు పాఠశాలలో మాట్లాడుతూ 21న అథ్లెటిక్స్‌లో 100, 400, 600 మీటర్ల పరుగు, లాంగ్, హై జంప్, షాట్ పుట్, డిస్క్‌త్రో, 22న వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంట్రీ ఫారంలు కొవ్వలి హైస్కూల్లో అందజేయాలన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు


బాల కళాకారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన


గ్రామోత్సవంలో గణాచారులకు చీరలు పర్చి ఆహ్వానిస్తున్న భక్తులు

భీమడోలు: స్థానిక గ్రామ దేవతలు మదిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజుల జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్థానిక చిన్నారులచే ప్రదర్శించబడిన కూచిపూడి, జానపద నృత్యాలు అలరించాయి. భీమడోలు, పోలసానిపల్లి, వడ్లపట్ల, సూరప్పగూడెం పరిసర గ్రామాలకు చెందిన బాల కళాకారుల నృత్య ప్రదర్శనలిచ్చారు. బుధవారం గణాచారుల గ్రామ ఊరేగింపు రావిచెట్టు సెంటర్, గుర్రాల చెర్వు, బీసీ కాలనీలో నిర్వహించారు. గణాచారులకు భక్తులు రోడ్లపై తడి చీరలను పరిచి చల్దిన్నం, బెల్లం సమర్పించి పసుపు నీళ్లు పోసి మొక్కుల తీర్చుకున్నారని ఆలయ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు తెలిపారు.

రైతు బజారులో తనిఖీలు


రైతు బజారులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని పత్తేబాద రైతు బజారులో మార్కెటింగ్ శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రైతులే స్వయంగా కూరగాయలు, కార్డుదారులు విక్రయాలు చేస్తున్నారా లేక బినామీలు విక్రయిస్తున్నారా? పండిస్తున్న కూరగాయలను విక్రయిస్తున్నారా, లేక ఇతర రాష్ట్రాల కూరగాయలు విక్రయిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. కార్డులో నమోదు చేసినవి కాకుండా ఇతర రకాల కూరగాయలు కూడా విక్రయిస్తున్న రైతును వారు ప్రశ్నించారు. రైతు బజారులో మరుగుదొడ్లు నిర్మించడానికి ప్రతిపాదించాల్సి ఉందని అధికారులు తెలిపారు. రైతుబజారులో గతంలో ఎస్టేట్ అధికారి ఉండే కార్యాలయం షెడ్డును ఆధునికీకరిస్తే మరింత మంది రైతులకు స్థానం కల్పించడంతో పాటు వినియోగదారులకు మరిన్ని దుకాణాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ మేరకు నివేదికను త్వరలోనే మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు నివేదిస్తామని తెలిపారు. తనిఖీల్లో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శారదారాణి, మార్కెటింగ్ ఏడీలు ఎం వరలక్ష్మి, ఎండీవీ శ్రీనివాసరావు, వి.మహేంద్రనాథ్, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ ఎస్‌కే మెహరాజ్ బాషా పాల్గొన్నారు.

వైభవంగా రామకోటి ఉత్సవాలు


నారాయణాచార్యులు భాగవతార్‌ను సన్మానిస్తున్న రమేష్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కళ్యాణ ం నిర్వహించారు. సాయంత్రం నగరంలోని హనుమాన్ నగర్ రాధాకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రతినిధి రాధ జోస్యుల సీతమ్మ వారి దివ్య చరితామృతం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నెల్లూరుకు చెందిన పరాయతం నారాయణాచార్యులు భాగవతార్ భక్తనందనార అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవతార్‌ను రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ సన్మానించారు.

కనుల పండువగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న చంద్రకాళీ ప్రసాద మాతాజీ, ఆకట్టుకున్న వేషధారణలు

భీమడోలు: సనాతన ధర్మ పరిరక్షణ లక్ష్యంగా గుంటూరు నంబూరు శ్రీకాళీవన ఆశ్రమం గుండుగొలను శాఖ ఆధ్వర్యంలో గుండుగొలను, పోతునూరు గ్రామాల్లో శోభాయాత్రను కనుల పండువగా నిర్వహించారు. శ్రీకాళీవనం ఆశ్రమ పీఠాధిపతులు శ్రీయోగిని శ్రీశ్రీశ్రీచంద్ర కాళీప్రసాద మాతాజీ ఆధ్వర్యంలో ఐదు రోజుల సత్సంగ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మాతాజీ భక్త బృందంతో కలిసి శోభా యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో వివిధ వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. తెల్లవారుజామున మేల్కొలుపు, సుప్రభాతం, గోపూజలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలిగితే సన్మార్గంలో నడుస్తారని మాతాజీ అన్నారు. ఈనెల 21వ తేదీన గుండుగొలనులో శ్రీశ్రీశ్రీ హనుమత్ కాళీవరప్రసాద్ బాబూజీ మహారాజ్ విగ్రహావిష్కరణ ఉంటుందని గ్రామ శాఖ నిర్వాహకులు కుమారస్వామి రాజు తెలిపారు. కార్యక్రమంలో సీతారామస్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్‌కుమార్, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటాం


వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్, మాజీ మంత్రి కారుమూరి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త విస్సకోటి వెంకటేశ్వరరావు బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ల పల్లి జయప్రకాష్ (జేపీ) సందర్శించిన నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి కారుమూరి సునీల్, నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు షమీం, రాష్ట్ర మైనార్టీ నాయకులు గాజుల బాజీ, రాష్ట్ర యూత్ కార్యదర్శి వెంకటేష్, నగర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు శివ, వాలంటరీ విభాగం అధ్యక్షుడు గణేష్, యూత్ నాయకులు బండ్లమూడి సునీల్, కోటి, స్థానిక నాయకులు ఉన్నారు.

జాగృతికి జాతీయ రికార్డులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన చిన్నారి నారాయణం జాగృతి బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవ రాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిలో భాషల సంబరాలు కార్యక్రమంలో పాల్గొని ఆరు జాతీయ రికార్డులు సృష్టించింది. నగరంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న జాగృతి ఇప్పటికే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు సూపర్‌కిడ్స్ రికార్డులు కలిపి మొత్తం 61 రికార్డులను నమోదు చేసుకుంది. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారి జాగృతి అసమాన ప్రతిభ చాటుకుంది. ఈ సందర్భంగా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్, ఎంఈఓ దేవినేని వెంకట రమణ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్‌కిడ్స్ రాష్ట్ర సమన్వయకర్త సిరిమువ్వ శ్రీనివాస్ మాట్లాడారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గణపవరం: రాష్ట్రంలో భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల బీమా సదుపాయం కల్పించాలని కోరుతూ గణపవరం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు భవననిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఆదినారాయణ, ఏడిది వేణు గోపాల కృష్ణ, సబ్బారపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

ఏలూరు (టూటౌన్): జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద ఉన్న జల్లేరు వాగుపై వంతెన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రమాదాలను అరికట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జల్లేరు వాగుపై వంతెన నిర్మాణం గిరిజనుల కల అని, ఏజెన్సీ ముఖద్వారంగా చెప్పుకొనే ఈ ప్రాంతం నుంచి అటు తెలంగాణ, ఇటు జంగారెడ్డిగూడెం వయా ఏలూరుకు రావాలంటే ఈ జల్లేరు వాగు దాటాలని పేర్కొన్నారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.5 కోట్ల అంచనాతో జల్లేరు వాగుపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, నేటికీ పూర్తి కాలేదని తెలిపారు.